# తొలితరం కమ్యూనిస్టు అమరుల సంస్మరణసభ



అమరుల సంస్మరణసభలో ప్రసంగిస్తున్న కా॥ నాగరాజు

**ప్రొద్దుటూరు, 24-5-17 :**

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం, ప్రొద్దుటూరు గ్రామంలో తొలితరం కమ్యూనిస్టు అమరుల స్మారక స్థూపం వద్ద 24-5-17న సంస్మరణ సభ జరిగింది. సభ ప్రారంభానికి ముందుగా స్థూపంవద్ద ఎర్రజెండాను సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ వై.సోని ఎగురవేసి అమరులకు జోహార్లర్పించారు. గ్రామ సీనియర్ కమ్యూనిస్టులు, స్థూపనిర్మాణకమిటీ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు పూలదండలతో స్థూపంవద్ద అమరులకు జోహార్లర్పించారు.

అనంతరం జరిగిన సంస్మరణసభకు స్థూపనిర్మాణ కమిటి కన్వీనర్ కా॥ ఈడా అక్క తాతయ్య అధ్యక్షత వహించారు. అమరులను స్మరిస్తూ సభికులు మౌనం పాటించారు. తొలితరం కమ్యూనిస్టుల త్యాగాలను, కృషిని ఈనాటి తరానికి తెలియజెప్పేందుకు ఈ సభలను జరుపుతున్నామన్నారు.

జనసాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కా॥దివికుమార్ మాట్లాడుతూ గత 12 సం॥లుగా ఈ గ్రామంలో క్రమం తప్పకుండా సంస్మరణ సభలు నిర్వహిస్తూ వస్తున్నారని, ఈసారి కా॥ భీమవరపు గురవారెడ్డి లేనిలోటు కనిపిస్తోందని గుర్తుచేసుకున్నారు. ఈ సం॥ కాలంలో గ్రామంలో కామ్రేడ్స్ పలగాని అంజయ్య, భీమవరపు బసివిరెడ్డి, నాంచారయ్య మొదలగువారు మరణించారని, చెపుతూ వారికి జోహార్లర్పించారు. సరిగ్గా 50 సం॥ల క్రితం నగ్జల్బరీ రైతాంగ ఉద్యమంపై పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరు పసిపిల్లలతో సహా 11 మందిని ఇదేరోజు బలిగొనటాన్ని గుర్తుచేస్తూ ఆ అమరులందరికీ జోహార్లర్పించారు. ఈ దోపిడీ రాజ్యంపోయి సమసమాజం రావాలని ఆకాంక్షిస్తూ తొలితరం అమరుల నుండి, నగ్జల్బరీ అమరుల నుండి ఈనాటి వరకు ఎందరో అమరవీరులు త్యాగాలు చేస్తున్నారని, వారి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళవలసిన బాధ్యత మనందరిపై వుందని గుర్తుచేస్తూ అదే ఆ అమరులందరికీ అర్పించే నివాళిగా పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ ఎం.ఎస్. నాగరాజు మాట్లాడుతూ దోపిడీ రద్దుకై సర్వస్వం త్యాగంచేసిన అమరుల జీవితాలు ఆదర్శం కావాలన్నారు. భారతదేశంలో సామ్రాజ్యవాదం వివిధ రూపాలలో సాగిస్తున్న దోపిడీని వివరించారు. ప్రస్తుత అర్ధవలస-అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలద్రోసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే కీలకమైన భూమిసమస్యపై కేంద్రీకరించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు - రైతాంగ సాగునీటి అవసరాల కోసం కాదని, బహుళజాతి పరిశ్రమల నీటి అవసరాలను తీర్చేందుకు, జల రవాణాకు, విద్యుదుత్పత్తి అవసరాల కోసమేనన్నారు. ఈ సభలో ఇంకా సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ వై.సోని, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ వీరబాబు, స్థూపనిర్మాణ కమిటి సభ్యులు ఆళ్ళ సత్యనారాయణరెడ్డి, సిపిఐ నాయకులు కా॥ మేరుగ విజయకుమార్, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) మరియు ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు ప్రసంగించారు.

సభానంతరం, సభకు ముందుగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాన్ని సాధించిన పేద విద్యార్థులకు బహుమతులను, ఆర్థిక సహకారాన్ని అందజేశారు. టిఎన్ మెమోరియల్ ట్రస్టు కోశాధికారి భీమవరపు ప్రభాకర్ అందరికీ ధన్యవాదాలు తెలియచేశారు.

ooooo